ప్రజల చేతిలో

www.ayudamdaily.com

# ఆయుధం

The Common People's Voice

గురువారం | జులై 30, 2026 | సంపుటి : 7 | సంచిక : 54 | పేజీలు : 2


## వన్యప్రాణుల సంరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా కాకతీయ జూ పార్కులో అవగాహన కార్యక్రమం




2లో



# భద్రకాళీ శరణం మమ

## శాకంబరి అలంకరణలో అమ్మవారు
## ఆలయానికి పోటెత్తిన భక్తులు
## ముగిసిన శాకంబరీ నవరాత్రి ఉత్సవాలు









**వరంగల్, ఆయుధం:** శ్రీ భద్రకాళీ దేవస్థానంలో పదిహేను రోజులుగా జరుగుతున్న శాకంభరీ నవరాత్రి మహోత్సవాలు బుధవారం ముగిశాయి. పదిహేనవ రోజు ఆషాడ శు। పౌర్ణమి రోజున అమ్మవారిని శాకంభరిగా అలంకరించి పూజారాధనలు జరిపారు. ఉదయం 10 గంటలకు అమ్మవారి దర్శనానికి దేవస్థానం వారు అనుమతించగానే కట్టలు తెంచుకున్న ఆనందంతో గుడిలోపలికి వచ్చి శాకంభరీ అలంకారములో ఉన్న అమ్మవారిని దర్శించుకొని పులకించిపోయారు. దేవస్థానం ప్రాంగణం అంతా భద్రకాళి శరణం మమ, శాకంభరీ శరణం మన అనే నామ స్మరణతో మార్మోగింది. ఆలయ ఈఓ రామల సునీత పోలీసు, ప్రభుత్వ శాఖల సమన్వయంతో జరిపిన ఏర్పాట్లు భక్తుల ప్రశంసలకు పాత్రమయ్యాయి. వేలాదిమంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. సుమారు 4000 కిలోల కూరగాయలు, పండ్లు సేకరించి దండలుగా చేసి అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఉదయం 3గంటలకు ప్రారంభమైన అమ్మవారి శాకంభరీ అలంకరణ ఉదయం 9.30గంటల వరకు సాగింది. ఉదయం 10 గంటలకు పూజానంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. అమ్మవారి అలంకరణకు కావలసిన కూరగాయలు, పండ్లు మంగళవారం సాయంత్రం నుండి భక్తులు గుడికి చేరుకొని అర్చకుల సూచనల స్వీకరిస్తూ దండలుగా చేసి ఇచ్చారు. రాత్రి నుండి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాన్ని కూడా లెక్కజేయకుండా భక్తులు అమ్మవారి దర్శనానికి పోటెత్తారు.

"మూర్తి రహస్యంలో 12వ శ్లోకం నుండి 17వ శ్లోకం వరకు ఈ శాకంభరీ ఆరాధనా విశేషం వివరించబడింది. ఈ శాకంభరీ దేవి నీల వర్ణం కలిగి కమరాసనముపై సుందరముగా నుండి తన చేతులయందు వరిమొలకలు, పుష్పములు, ఫలములు, చిగురుటాకులు, దుంపగడ్డలు మొదలగు కూరగాయల సముదాయమును ధరించి ఉండును. ఈ శాక సముదాయములు అంతులేని కోరికలను తీర్చు రసములు గలపై జీవులకు కలుగు అలక దప్పి మృత్యువు, ముసలితనము, జ్వరము మొదలగు వానిని పోగొట్టును. ఉమా, గౌరీ, సతీ, చండీ, కాశికా, పార్వతీ అనే పేర్లతో కూడా ఈ దేవి ప్రసిద్ధి పొందినది. ఈ శాకంభరీ దేవిని భక్తితో ధ్యానం చేయువారు, నమస్కరించువారు, జపించువారు. పూజించువారు తలగిపోని అన్న, పానామృత ఫలములను అతి శీఘ్రముగా పొందుతారని ఈ మూర్తి రహస్యంలో తెలుపబడింది. శాస్త్రాలలో ఈ శాకంభరీ మహాత్మ్యం వివరింపబడి ఉండటం వలన ఈ శాకంభరీ ఆరాధన బహుళ జనాదరణ పొందినది."

శాకంభరీ అలంకరణ హన్మకొండ టీచర్స్ కాలనీ వాసి ప్రముఖ పవర్ ఇన్స్టాలేషన్స్ కాంట్రాక్టరు డా. మండువ శేషగిరిరావురేణుక దంపతులు, హైదరాబాదు వాస్తవ్యులు ఈమని హరికృష్ణ స్మిత దంపతులు సౌజన్యంతో జరిగింది. పోలీసు శాఖవారు, ఎన్.సి.సి వాలంటర్లు, శ్రీ లక్ష్మీవెంకటేశ్వర, లక్ష్మి శ్రీనివాస సేవా సమితి సభ్యులు భక్తులకు క్యూలైన్లలో సేవలందించారు. భద్రకాళి సేవాసమితి కన్వీనర్ అయితే గోపీనాథ్ ఆధ్వర్యంలో వేలాది మంది భక్తులకు ప్రసాద వితరణ జరిపారు. దేవాలయములో మార్వాడీ మిత్రమండలి ఆధ్వర్యంలో దేవాలయమునకు విచ్చేసిన భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం శాకంభరీ నవరాత్రుల పూర్ణాహుతి కార్యక్రమం జరిగింది.



అమ్మవారి దర్శనానికి క్యూలో నిలుచున్న భక్తులు



## యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ గ్రీన్ సిగ్నల్

- విపక్షాల నినాదాల మధ్య ఆమోదం
- మూజువాణి ఓటుతో యాంటీ పేపర్ లీక్ బిల్లుకు ఆమోదం

**ఢిల్లీ, ఆయుధం:** యాంటీ పేపర్ లీక్ చట్ట సవరణ బిల్లును లోక్‌సభ ఆమోదించింది. 'వుయ్ వాంట్ జస్టిస్' అనే విపక్షాల నినాదాల మధ్య మూజువాణి ఓటుతో బిల్లుకు ఆమోదం తెలిపింది. బిల్లును జేపీసీకి పంపాలని కొందరు ఎంపీలు డిమాండ్ చేసినా, వారు ప్రతిపాదించిన సవరణలు వీగిపోయినట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. అనంతరం స్పీకర్ ఓం బిర్లా లోక్‌సభను గురువారానికి వాయిదా వేశారు. పేపర్ లీక్‌లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించి బిల్లులో నిబంధనలు రూపొందించామని తెలిపింది.

**రాహుల్‌గాంధీ అప్రజాస్వామిక భాషను వాడారు: జితేంద్రసింగ్**
అంతకుముందు పీఎంవో సహాయమంత్రి జితేంద్రసింగ్ యాంటీ పేపర్ లీక్ బిల్లుపై జరిగిన చర్చకు సమాధానం ఇచ్చారు. చర్చ సందర్భంగా విపక్షాలు చేసిన ఆరోపణలను ఆయన తిప్పికొట్టారు. ఇప్పటివరకు 152 సార్లు పేపర్ లీక్‌లు జరిగాయన్న కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకాగాంధీ ఆరోపణలకు ఆధారమే లేదని అన్నారు. ప్రతిపక్ష నేత రాహుల్ వ్యాఖ్యలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయని జితేంద్రసింగ్ అన్నారు. రాహుల్ వ్యాఖ్యలు చూస్తే సభా సంప్రదాయాలపై ఆయనకు అవగాహన లేదని రుజువవుతోందన్నారు. రాహుల్‌గాంధీ అప్రజాస్వామిక భాష వాడారని దుయ్యబట్టారు.



## ప్రభుత్వ భూముల రక్షణలో నిర్లక్ష్యం వద్దు

- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- భట్టుపల్లిలో ప్రభుత్వ భూమి క్షేత్రస్థాయి పరిశీలన

**హనుమకొండ, ఆయుధం:** ప్రభుత్వ భూముల రక్షణ, వాటి వివరాలపై స్పష్టత అత్యంత ముఖ్యమని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. బుధవారం కాజీపేట మండలం భట్టుపల్లి గ్రామ పరిధిలో గతంలో స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ సైనికులకు కేటాయించిన ప్రభుత్వ భూమిని జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత భూమికి సంబంధించిన పూర్తి వివరాలను తహసీల్దార్ రాజును అడిగి తెలుసుకున్నారు. భూమి కేటాయింపుకు సంబంధించిన రికార్డులు, మ్యాపులను పరిశీలించి, వాటిలో నమోదైన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులతో కలిసి భూమి హద్దులను ప్రత్యక్షంగా పరిశీలించారు. భూమి ఎక్కడి నుంచి ఎక్కడి వరకు విస్తరించి ఉందనే అంశంపై స్పష్టత పొందుతూ, భూ రికార్డులు, క్షేత్రస్థాయి పరిస్థితులు ఒకే విధంగా ఉండేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూముల రక్షణ, వాటి సక్రమ నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. ఈ పరిశీలనలో సర్వేయర్ స్టాలిన్, ఆర్ఐ కృష్ణ, రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్





# ఎయిడెడ్ ప్రభుత్వ శ్రీ వెంకటేశ్వర హైస్కూలు ఆర్వో వాటర్ ప్లాంట్‌కు ఎన్నారై విరాళం

**వరంగల్, ఆయుధం:** విదేశాల్లో స్థిరపడినప్పటికీ, కన్న తల్లిని, తన మాతృభూమిపై ప్రేమను చాటుకున్నారు ప్రవాస భారతీయుడు (ఎన్ఆర్ఐ) భారత సదానందం. తాను పుట్టి పెరిగిన ప్రాంతంలోని ఎయిడెడ్ ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేసి పూర్వ వైభవం తీసుకురావాలని సంకల్పంతో పెన్సిల్వేనియాలో స్థిరపడిన భారత సదానందం సంకల్పించారు. విద్యార్థులకు పుస్తకాలు విజ్ఞానాన్ని అందిస్తే! మౌలిక సదుపాయాలు విద్యార్థులను ప్రోత్సాహిస్తాయని విశ్వసించిన భారత సదానందం మౌళిక సదుపాయాలు కల్పించేందుకు తోటి ప్రవాస భారతీయుల సహకారంతో ఏర్పాటు చేసిన స్తైన్స్ ల్యాబ్, క్రీడా సామగ్రి, ఆర్వో వాటర్ ప్లాంట్‌ను బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు న్యాయవాది సురేంద్ర కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు





చేసిన కార్యక్రమంలో దాత భారత సదానందం మాట్లాడుతూ —— విద్యార్థులకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఈ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశాను. భవిష్యత్తులో కూడా పాఠశాల అభివృద్ధికి నావంతు సహాయ సహకారాలు అందిస్తాను అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా హాజరైన పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిట్యాల సోమశేఖర్, కార్పొరేటర్ మరిపెల్లి రవి, హైస్కూలు కరస్పాండెంట్ ఏరా కోటేశ్వర్, భారత శ్రీశైలం, మోర సమ్మయ్య, పాకనాటి చక్రధర్ తదితరులు భారత సదానందం దాతృత్వాన్ని కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు పూర్వ విద్యార్థులు ముందుకు రావడం ఎంతో అభినందనీయం. భారత సదానందం చేసిన ఈ సేవ ఎంతోమందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది అని వక్తలు పేర్కొన్నారు. భారత సదానందం ను పాఠశాల యాజమాన్యం, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం హన్మకొండ జిల్లా అధ్యక్షుడు బచ్చు ఆనందం, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ ప్రజలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# మానసిక దివ్యాంగులకు ఉచిత వైద్య శిబిరం

**హనుమకొండ, ఆయుధం:** గురు పూర్ణిమ వేడుకలు పురస్కరించుకుని అనురాగ్ హెల్పింగ్ సొసైటీ, శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి ట్రస్ట్ సహకారంతో డాక్టర్ అనితా రెడ్డి ఆధ్వర్యంలో హనుమకొండలోని స్పందన మానసిక దివ్యాంగుల ఆశ్రమములో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మీనారాయణ మానసిక దివ్యాంగులకు, సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సూచనలు అందజేసి, మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి అనురాగ్ సొసైటీ, వరల్డ్ వైజ్ కన్జూమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ సంస్థల నేషనల్ వైస్ చైర్మన్, ఎడ్వైజర్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యురాలు డాక్టర్ అనితా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ.. మానసిక దివ్యాంగుల సేవ విశ్వ మానవ సేవ అన్నారు, ప్రత్యేక అవసరాలున్న పిల్లల ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగ పడతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరీక్షలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో చేయించుకోవాలని, ఉచిత వైద్య శిబిరాలను వినియోగించు కోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మీనారాయణ, కెమిస్ట్ రవి, ఆశ్రమ నిర్వాహకులు సుచరిత వసుధ, హరిత, భార్గవి, రాఘవ పాల్గొన్నారు. అనంతరం అభిరామ్ గార్డెన్ లో గురు పూర్ణిమ వేడుకలలో అన్నదాన కార్యక్రమంలో డాక్టర్ అనితా రెడ్డి పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరు ఓటు హక్కు ను కాపాడుకోవాలి

- **వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాష్, తహసిల్దార్ మహ్మద్ ఇక్బాల్**

**వరంగల్, ఆయుధం:** 42 వ డివిజన్ లోని పద్మశాలి భవన్ లో ఎస్.ఐ.ఆర్ కార్యక్రమం కొనసాగుతున్న తీరును వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాష్ వరంగల్ మండల తహసిల్దార్ మహ్మద్ ఇక్బాల్ పర్యవేక్షించారు. అనంతరం వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాష్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థ లో ఓటు హక్కు ఎంతో విలువైనది. దీనిని కాపాడుకోవడం ప్రతిఒక్కరి భాధ్యత. భారత ఎన్నికల సంఘం ప్రవే



శపెట్టిన "ప్రతేక ఓటరు సమగ్ర సవరణ" కార్యక్రమంలో అందరూ పాల్గొని తమ ఓటు కోల్పోకుండా ఏనుమరేషన్ ఫారాలు వ్రాసి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఎల్ వోలు, రెవెన్యూ ఆఫీసర్లు, బీఎల్ఎలు తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 6 నుండి 14 వరకు పాద యాత్రలు

- **సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు**

**హనుమకొండ, ఆయుధం :** ప్రజాసమస్యలను పరిష్కరించడంలో విఫలమైన కేంద్ర బిజెపి ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఆగస్టు 6 నుండి 14 వరకు భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్ర, జిల్లా, మండల కేంద్రాలలో పాదయాత్రలు నిర్వహించనున్నట్లు సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు తెలిపారు. హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో బుధవారం జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి రాష్ట్ర సమితి సభ్యులు సిరబోయిన కరుణాకర్, జిల్లా సహాయ కార్యదర్శులు




తోట బిక్షపతి మద్దెల ఎల్లేష్ తో కలిసి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు పాదయాత్ర పోస్టర్ లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు అశోక్ స్టాలిన్, భాష బోయిన సంతోష్, బత్తిని సదానందం, ఎదునూరి వెంకటరాజం, వేల్పుల సారంగపాణి, దుప్పటి సాంబయ్య పాల్గొన్నారు.

# వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- **జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**
- **అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా కాకతీయ జూ పార్కులో అవగాహన కార్యక్రమం**




**హనుమకొండ, ఆయుధం:** పర్యావరణ సమతుల్యత, జీవ వైవిధ్య పరిరక్షణ కోసం వన్యప్రాణులను కాపాడుకోవడం అత్యంత అవసరమని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. బుధవారం హనుమకొండ హంటర్ రోడ్డులోని కాకతీయ జూ పార్కులో జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ పులుల దినోత్సవం కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అటవీశాఖ అధికారి ముకుంద రెడ్డి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పులి వన్యప్రాణుల్లో అత్యంత కీలకమైన జాతి అని, అడవుల పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో పులుల పాత్ర ఎంతో ముఖ్యమని అన్నారు. ఒకప్పుడు పులుల వేట విస్తృతంగా జరిగేదని, అటవీశాఖ చేపట్టిన కఠిన చర్యలతో అక్రమ వేట గణనీయంగా తగ్గి, దేశంలో పులుల సంఖ్య క్రమంగా పెరుగుతోందని తెలిపారు. దేశంలో చిరుతల (చీతాలు) సంఖ్య తగ్గిపోవడంతో వాటిని ఇతర ఖండాల నుంచి తీసుకొస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణలోని కవ్వాల్ పులుల అభయారణ్యంలో ప్రస్తుతం ఒక్క పులి కూడా లేకపోవడం ఆందోళనకరమని, అదే సమయంలో సమీపంలోని మహారాష్ట్ర తడోబా అభయారణ్యంలో పులుల సంఖ్య గణనీయంగా ఉందని తెలిపారు. అడవులు, వన్యప్రాణులు అంతరించిపోకుండా కాపాడుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థులు ప్రకృతి, వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన పెంపొందించుకొని, వాటి పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అటవీశాఖ అధికారి ముకుంద రెడ్డి మాట్లాడుతూ, అంతరించిపోతున్న పులులతో పాటు ఇతర వన్యప్రాణులను సంరక్షించడం సమాజం మొత్తం బాధ్యత అని అన్నారు. వన్యప్రాణుల సంఖ్య తగ్గిపోవడానికి అనేక కారణాలు ఉన్నాయని, వాటి నివారణకు ప్రజల్లో అవగాహన పెంపొందించడం అవసరమని తెలిపారు. భావితరాలకు ప్రకృతి సంపదను అందించాలంటే విద్యార్థులు వన్యప్రాణుల సంరక్షణలో చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. ఈ సందర్భంగా వన్యప్రాణుల సంరక్షణపై రూపొందించిన అవగాహన పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన మరియు చిత్రలేఖన పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వోలు మయూరి, శిరీష, శ్రీనివాస్, ఓరుగల్లు వైల్డ్‌లైఫ్ సొసైటీ ప్రతినిధి శ్యామ్ సుందర్, వివిధ పాఠశాలల విద్యార్థులు, అటవీశాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా సి నా రె జయంతి వేడుకలు

**హనుమకొండ, ఆయుధం:** ప్రముఖ కవి జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డాక్టర్ సి.నారాయణ రెడ్డి జయంతి సందర్భంగా బుధవారం రాంనగర్ లోని జిల్లా సంఘ భవనంలో క్లాస్మేట్ క్లబ్ ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ రిటైర్డ్ యంపీడీఓ పెద్ది ఆంజనేయులు ఆధ్వర్యంలో నలుగురు కవులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కుందూరు గోపాల్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో కరీంనగర్ జిల్లా మారుమూల ప్రాంతంలో జన్మించి ప్రపంచ విఖ్యాత కవిగా జ్ఞానపీఠ పురస్కారం పొందడం తెలంగాణ ప్రాంత ప్రజలకు గర్వకారణమని అన్నారు. క్లాస్మేట్ క్లబ్ ప్రతినిధి రిటైర్డ్ యంపీడీఓ పెద్ది ఆంజనేయులు మాట్లాడుతూ తెలంగాణ ప్రముఖుల ను గుర్తించి స్మరించాలని అన్నారు. ఈ సందర్భంగా హనుమకొండలోని ప్రముఖ కవులు శనిగరం రాజమోహన్, రామబ్రహ్మచారి, కుందూరు గోపాల్ రెడ్డి యండీ.నయిముద్దీన్ లను దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం అసోసియేట్ అధ్యక్షుడు యండి.నయిముద్దీన్, ఉపాధ్యక్షుడు నారాయణ రావు, కార్యవర్గ సభ్యులు జగదీశ్వర్ రెడ్డి, సమ్మయ్య, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా
# భూముల రీసర్వే

**హనుమకొండ, ఆయుధం:** జిల్లాలోని 70 గ్రామాల్లో చేపట్టిన భూముల రీ సర్వేను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ ముప్పారం, వేలేరు మండలం షోడశ పల్లి లో భూముల రీసర్వే పై భూములు కొలతల శాఖ ఆధ్వర్యంలో గ్రామ సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా భూములు కొలతల శాఖ అధికారులు, సర్వేయర్లు భూముల రీసర్వే కి సంబంధించిన అంశాలపై గ్రామసభలో రైతులు, స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రవి మాట్లాడుతూ భూములకు సంబంధించి ఎలాంటి వివాదాలకు తావు లేకుండా భూముల రీ సర్వే జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భూముల రీ సర్వే చేపడుతుండగా సంబంధిత రైతులు, స్థానిక ప్రజా ప్రతినిధులు సర్వేయర్లకు సహకరించాలని కోరారు. తహసిల్దార్ భావ్ సింగ్, కోమి, సర్వేయర్లు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, రైతులు, స్థానికులు పాల్గొన్నారు.

# ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- **చీకుపల్లి–పెద్దగొల్లగూడెం ఇసుక వాగు రోడ్డు పరిస్థితి పరిశీలన**
- **జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**



**ములుగు, ఆయుధం:** జిల్లా లో మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తెలిపారు. బుధవారం వాజేడు మండలం చీకుపల్లి-పెద్దగొల్లగూడెం ఇసుక వాగు డైవర్షన్ రోడ్డు పరిస్థితిని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు పరిశీలించి ప్రత్యామ్నాయ రహదారి పునరుద్ధరణకు తక్షణ చర్యలు చేపట్టాలని సంబధిత అధికారులను ఆదేశించారు. వాజేడు మండలాల పరిధిలో చీకుపల్లి-పెద్దగొల్లగూడెం గ్రామాల మధ్య ఇసుకవాగుపై నిర్మాణంలో ఉన్న వంతెన వద్ద ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డు మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు వరద నీరు రావడంతో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డు దెబ్బ తినడంతో తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలను అనుసంధానించే జాతీయ రహదారి-163పై వాహనాల రాకపోకలు తాత్కాలికంగా నిలపడం జరిగినది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు వరద ప్రవాహం తగ్గిన అనంతరం ప్రత్యామ్నాయ రహదారిని అత్యవసరంగా పునరుద్ధరించి రాకపోకలను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రమాదాలు జరగకుండా పోలీస్, రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖలు సమన్వయంతో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. వరద ఉధృతి ఉండటంతో పైపులు దెబ్బతినకుండా డైవర్షన్ రోడ్డుకు ఇరువైపులా కాల్వలు తవ్వి నీటిని మళ్లిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పిఓ లెనిన్ వత్సల్ టోప్పో, ఏటూరు నాగారం ఏ ఎస్పీ మనన్ భట్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో కొండా కృపాకర్, పాల్గొన్నారు.

# వైద్యుల సేవలు చిరస్మరణీయం

- **1000 పిల్లర్స్ లయన్స్ ఆతిథ్య క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా డాక్టర్స్ డే**






**హనుమకొండ, ఆయుధం:** సమాజానికి ప్రాణదాతలుగా నిలుస్తూ, నిస్వార్థ సేవనందిస్తున్న వైద్యుల సేవలు ఎప్పటికీ చిరస్మరణీయమని కాళోజీ నారాయణ రావు ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ కే.రమేష్ రెడ్డి అన్నారు. లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం వరంగల్ కేఎంసీ క్యాంపస్‌లోని ఎన్ఆర్ఐ ఆడిటోరియంలో 'డాక్టర్స్ డే' వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. 'లయన్స్ క్లబ్ సంక్షేమం', 'క్లబ్ హెచ్ఎన్‌కే థౌసండ్ పిల్లర్స్' సంయుక్త ఆతిథ్యంలో "హార్ట్‌ఫుల్ సర్వీస్ హ్యాపీ ఫేసెస్" నినాదంతో ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా సమాజానికి అంకితభావంతో సేవనందిస్తున్న పలువురు ప్రముఖ వైద్యులను ఘనంగా సత్కరించారు. డాక్టర్స్ హానరింగ్ చైర్మన్ లయన్ డాక్టర్ వైద్యం గౌతమ్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో, డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ నరహరి సుధాకర్ రెడ్డి ప్రారంభోత్సవ అధికారిగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో వీసీ మాట్లాడుతూ వైద్యులు లేని సమాజాన్ని మనం ఊహించలేమన్నారు. లయన్స్ జిల్లా గవర్నర్ నరహరి సుధాకర్ రెడ్డి డాక్టర్స్ డే వేడుకలను ప్రారంభిస్తూ సమాజంలోని ముఖ్య వృత్తులలో ఉన్న వారిని గుర్తించి ప్రోత్సహించడం తమ కార్యక్రమాల్లో ప్రత్యేక భాగం అన్నారు. అందులో భాగంగా ఈరోజు ఉమ్మడి జిల్లాలోని పేరెన్నిక కన్నా 60 మంది వైద్యులను సత్కరింప చేస్తున్నామని చెప్పారు. ఈ వేడుకల్లో భాగంగా.. ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ పి. హరికిషన్ రెడ్డి, సెకండ్ వైస్ గవర్నర్ లయన్ రేవూరి రమణ రెడ్డి, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ అడ్వైజర్ పీసీజీ లయన్ ఎన్.వెంకటేశ్వర రావు, చీఫ్ అడ్వైజర్ పీసీజీ లయన్ ముచ్చ రాజి రెడ్డి, జీఏటీ అడ్వైజర్ పిడిజి ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. వీరితో పాటు పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్లు లయన్ కుందూరు వెంకట్ రెడ్డి, లయన్ పొట్లపల్లి శ్రీనివాస్ రావు, లయన్ టి.లక్ష్మీనర్సింహ రావు, లయన్ డాక్టర్ కే. సుధాకర్ రెడ్డి, లయన్ డాక్టర్ కే.రాజేందర్ రెడ్డి, లయన్ డాక్టర్ డి.లవ కుమార్ రెడ్డి తదితరులు వేడుకలను శోభాయమానం చేశారు. డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రటరీ లయన్ పాము శ్రీనివాస్, ట్రెజరర్ లయన్ చొప్పరి సోమయ్య; రీజినల్ చైర్మన్లు లయన్ పబ్బ చంద్రమోహన్, లయన్ బిల్లా సులోచన, లయన్ తాడూరి రేణుక, లయన్ డి. వెంకటసుబ్బయ్య, లయన్ డాక్టర్ ఎస్. నాగవాణి, లయన్ డాక్టర్ జైన రమేష్ తదితరులు కార్యక్రమ ఏర్పాట్లను పర్యవేక్షించారు. హోస్ట్ క్లబ్ అధ్యక్షులు లయన్ వైద్యం రాజగోపాల్, కార్యదర్శి లయన్ గంజి నరహరి, కోశాధికారి లయన్ మార్త పాపయ్య తదితరులు ఈ కార్యక్రమ విజయవంతంలో కీలక పాత్ర పోషించారు. సత్కారం అందుకున్న వైద్యుల్లో డా.కె.సుధాకర్ రెడ్డి, డాక్టర్. నాగార్జున రెడ్డి, డా.లవకుమార్ రెడ్డి, డా.బైరి. లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.



# సాయి సేవా దళ్ ఆధ్వర్యంలో గురు పౌర్ణమి వేడుకలు

**వరంగల్, ఆయుధం:** సాయి సేవా దళ్ ఆధ్వర్యంలో బుధవారం ఎల్లమ్మ బజారు లోని సాయి సేవాదళ్ భజన మందిరం ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ షిర్డీ సాయిబాబాకు పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీరు, గంధం, పన్నీరు, వివిధ రకాల సుగంధ ద్రవ్యాలు, పుష్పాలతో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు, హారతి కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఓం సాయి.. జయ జయ సాయి ఏకనామ యజ్ఞం ఘనంగా నిర్వహించారు. గురు పౌర్ణమి వేళ పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తుల కోసం సాయి సేవా దళ్ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వందలాది మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించి సాయిబాబా ఆశీస్సులు పొందారు. సాయంత్రం సాయిబాబా ఉత్సవ విగ్రహాన్ని అలంకరించిన పల్లకిలో ఉంచి నగరంలోని ప్రధాన వీధుల గుండా భక్తి గీతాలు, భజనలు, మంగళ వాయిద్యాల నడుమ వైభవంగా పల్లకి ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని "ఓం సాయి శ్రీ సాయి జయ జయ సాయి " నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు. ఈ వేడుకల్లో ఆలయ కమిటీ సభ్యులు, సాయి సేవా దళ్ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.



# ఆదర్శ గురువుకు సన్మానం

**వరంగల్, ఆయుధం:** గురుపౌర్ణమి సందర్భంగా జూనియర్ న్యాయవాదుల భవిష్యత్తుకు మార్గదర్శకుడిగా నిలిచిన సీనియర్ న్యాయవాది పి.నర్సింహారాములుకు బుధవారం వారి కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. శాలువా, పుష్పగుచ్ఛం, జ్ఞాపికతో సత్కరించి వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ప్రతీ సీనియర్ న్యాయవాది గురువు పాత్ర పోషించి సమాజ నిర్మాణంలో కీలకంగా మారాలని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శామంతుల శ్రీనివాస్, గుర్రాల వినోద్, సూరం నరసింహాస్వామి, గునిగంటి శ్రీనివాస్, పోషిని రవీందర్ శ్రీనివాస్ రాజు ప్రవీణ్ పాల్గొన్నారు.

# హోంగార్డ్ కుటుంబానికి ఆర్థిక సాయం

**హనుమకొండ, ఆయుధం:** ఆకస్మికంగా మరణించిన హోంగార్డ్ కుటుంబానికి వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఐపిఎస్ చేతుల మీదుగా ఐదు లక్షల ఆర్థిక సాయం చెక్కును బుధవారం సీపీ కార్యాలయంలో అందజేశారు. రాష్ట్ర పోలీస్ శాఖకు సహాయ సహకారాలను అందిస్తున్న హోంగార్డ్స్ ఆకస్మికంగా గాని లేదా ప్రమాదాల్లో మరణిస్తే సిబ్బంది కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో వుంచుకొని, మరణించిన హోంగార్డ్స్ కుటుంబాలకు ఐదు లక్షల రూపాయల ఆర్థిక సాయాన్ని అందించాలని రాష్ట్ర పోలీస్ విభాగం ఉత్తర్వులు జారీ చేసింది. దుగ్గొండి పోలీస్ స్టేషన్ పరిధిలో హోంగార్డ్ గా విధులు నిర్వహిస్తూ గత ఏడాది ఆకస్మికంగా మరణించిన పి. శ్రీనివాస్ రెడ్డి భార్యకు పోలీస్ కమిషనర్ ఆర్థిక చెక్కును అందజేశారు. ఎ.ఆర్ అదనపు డీసీపీ శ్రీనివాస్, హోంగార్డ్స్ ఆర్ ఐ చంద్రశేఖర్ పాల్గొన్నారు.



Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695